క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై జి. సురేష్

వేటపాలెం: క్రీడా కారులు క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని ఎస్సై జి. సురేష్ సూచించారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో బక్రీద్ పురస్కరించుకొని.. క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై బుధవారం ప్రారంభించారు. రూ.20 నగదు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.7 వేలు బహుమతులుగా అందిస్తామని తెలిపారు. అందె కృష్ణ, జార్జి సామేలు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న దేవరకొండ నరేంద్ర వర్మ

మేదరమెట్ల: స్నేహితుల మధ్య నెలకొన్న వివాదంలో నలుగురు వ్యక్తులు ఓ యువకుడ్ని తీవ్రంగా గాయపరచిన సంఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుని సమాచారం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన దేవరకొండ నరేంద్రవర్మ గతంలో మేదరమెట్ల బంధువుల ఇంట్లో ఉండి ఐటీఐ చదివాడు. బంధువుల్లో ఒకరు ఫోన్ చేసి మోటారు బైకు కొన్నాను.. పార్టీ ఇస్తాను రమ్మని చెప్పడంతో నరేంద్రవర్మ మేదరమెట్లకు వచ్చాడు. నలుగురు వ్యక్తులు ఆటోలో ఎక్కించుకొని వెళ్లి దాడి చేసిన అనంతరం అర్ధరాత్రి సోమవరప్పాడు సమీపంలో పడేసి వెళ్లారు. తీవ్ర గాయాలతో ఉన్న యువకుడు స్థానికుల సాయంతో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎంఈఓలకు సత్కారం



ఎంఈఓలను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

జె.పంగులూరు: మండల పరిధిలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం ఏఈఓలు నాగభూషణం, వీరాంజనేయులను ఏపీటీఎఫ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. రెండు దశాబ్దాలుగా ఎంఈఓగా పనిచేస్తున్న నాగభూషణం మండలంలోని విద్యాస్థాయికి చేసిన కృషికి గాను సన్మానించారు. నూతన ఎంఈఓగా బాధ్యతలు తీసుకున్న కె. వీరాంజనేయులను మర్యాద పూర్వకంగా సత్కరించారు. ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షులు బత్తుల రామకోటిరెడ్డి మాట్లాడుతూ రాబోవు విద్యా సంవత్సరంలో మండలంలోని ఉపాధ్యాయులందరూ మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో కృషి చేసి పంగులూరు మండలంలోని పాఠశాలలన్నింటిలో విద్యాప్రమాణాలు క్రమశిక్షణ నెలకొల్పడానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రామారావు, అధ్యక్షులు సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

అద్దంకి రూరల్: ఉడ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరుతూ బుధవారం అద్దంకి పట్టణ కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పెంటర్లు.. తహసీల్దార్ సుబ్బారెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణ కార్పెంటర్లు పాల్గొన్నారు.



చీరాల: యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు షేక్ రెహన, షేక్ నిషాద్ నాజ్, న్యాయవాదులు



అద్దంకి: ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో యోగా చేస్తున్న కూలీలు



బల్లికురవలో యోగా చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● ఘనంగా యోగా డే

అద్దంకి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ సంస్థలు, యోగా శిక్షకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాంగంగా పట్టణంలోని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివారావు ఆధ్వర్యంలో యోగా గురువు శేషారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యోగా గురించి వివరించారు. నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. వేల సంవత్సరాల క్రితం పంతంజలి అనే ముని యోగా అనే విద్యను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంఈవో రాఘవరావు, విద్యా కమిటీ చైర్మన్, సుధాకర్‌రెడ్డి, పి. కృష్ణారావు, ఉపాధ్యాయులు ఎస్‌ఎం రఫీ, పి. ఆంజనేయులు, అంజాద్ బాషా రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ధర్మవరం, బొమ్మనంపాడు గ్రామాల్లో ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏపీఎం గాయత్రి యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు. కేఆర్‌కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ వి. మోహనరావు ఆధ్వర్యంలో యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన విద్యార్థులకు యోగా విశిష్టత, అవసరాన్ని గురించి చక్కగా వివరించారు. విద్యార్థులు సూర్య నమస్కారాలు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అధ్యాపకుడు శిఖామణి విద్యార్థులుచే యోగాసనాలు సూర్య నమస్కార ఆసనాలు వేయించారు.

బల్లికురవ: యోగా వ్యాయామం మాత్రమే కాదని, మనస్సు, ఆత్మ శరీరాన్ని ఏకం చేసే సాధన ప్రక్రియ అని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులతో కలిసి యోగా చేశారు. ప్రతి రోజు యోగా చేయటంవల్ల ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఎంఈవో కె. రమేష్ బాబు, పాఠశాల హెచ్‌ఎం కె. హనుమంతరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారంచేడు: శారీరక, మానసిక ఉల్లాసానికి యోగా ఉపయోగపడుతుందని.. ఈఓపీఆర్డీ ఆర్. రమేష్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవంలో మాట్లాడారు. యోగా గురువు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు యోగా ఆసనాలు వేశారు. శారీరక దృఢత్వంతో పాటు, శరీరంలోని అన్ని అవయవాలు ఎంతో చురుగ్గా ఉంటాయన్నారు. మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులు అంజయ్య, జయప్రకాష్, హెచ్‌ఎం గుత్తా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



చినగంజాం: యోగా గురించి వివరిస్తున్న హిమాలయ ధ్యానయోగి సురేష్

వేటపాలెం: ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని హెచ్ ఎం పి. దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం బాలికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కఠారివారిపాలెం మండల పరిత్ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం భవనం రాణి యోగాసనాలు వేయించారు. కట్టా సుబ్బారావు, జి. సుబ్బారావు, ఎం. శీలాదేవి, కె. రవీంద్రబాబు, ఎస్‌కే నబీరసూల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చీరాల రూరల్: యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహన అన్నారు. బుధవారం స్థానిక కోర్టు భవన సముదాయంలో యోగా గురువు శివ కోటేశ్వరరావు గురూజీ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు షేక్ రెహన, షేక్ నిషాద్ నాజ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు చేశారు.

మార్టూరు: యోగ గురువు ఆత్మకూరి రామాంజనేయులు ఆధ్వర్యంలో స్థానిక హర్షిణి విద్యాసంస్థలో బుధవారం యోగాసనాలు నేర్పించారు. అంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్సెస్సీ అధికారి అలవలపాటి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలోయోగాసనాలను వేశారు. పలువురు హాజరయ్యారు.

చినగంజాం: హిమాలయ ధ్యానయోగి ఏంజిల్స్ సురేష్ ఆధ్వర్యంలో స్థానిక భావన్నారాయణ స్వామి యోగా ధ్యాన శిక్షణ కేంద్రంలో యోగా గురువు వీవీ రామానుజం అధ్యక్షతన యోగా చేయంచారు. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భావన్నారాయణ స్వామి యోగ కేంద్రం గురువు వీవీ రామానుజం, హెచ్‌ఎం డి. రత్న కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): యోగ జీవితంలో ఓ భాగమని పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎ. శుభవాణి అన్నారు. బుధవారం స్థానిక రోటరీ భవన్‌లో యోగాసనాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కొల్లా నరేంద్ర కుమార్, రావి సత్యనారాయణ పాల్గొన్నారు.

చీరాల అర్బన్: వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ సి.హెచ్ రమణమ్మ సూర్య నమస్కారాలు చేయించారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలతో ఆర్థిక ప్రగతి

కారంచేడు: కుటీర పరిశ్రమల స్థాపన పేద కుటుంబాలకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూరుస్తుందని ఎంపీడీఓ డి. విజయలక్ష్మి అన్నారు. బుధవారం కారంచేడు వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామాల్లో అర్హత ఉండి, చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమల స్థాపనకు బ్యాంకుల రుణాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని స్వర్ణ, కొడవలివారిపాలెం, తిమిడెదపాడు, దగ్గుబాడు, జరుబులవారిపాలెం గ్రామాలకు చెందిన 6 సచివాలయాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో వీఓఏలు ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక, రుణాల మంజూరు వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కెనరా బ్యాంక్ మేనేజర్లు ప్రగతి, ఐకేపీ ఏపీఎం మధుసూదనరావు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఖాశీం, సీసీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఓఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కారంచేడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

చీరాలలో భారీ వర్షం

చీరాల: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గోపాలకృష్ణయ్య పార్కు, మసీదు సెంటర్, సురేష్ మహల్ రోడ్డు, దర్బార్ రోడ్డు, ఈపూరుపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో, చీరాల-బాపట్ల రోడ్డులో వర్షంనీరు నిలిచి పోయింది.

మార్టూరు: మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కోలలపూడి, రాజుపాలెం, కోనంకిలో రాకపోకలకు అంతరాయం కలిగింది.

చల్లని వర్షం.. రైతుకు ఇష్టం

కారంచేడు: గత రెండు, మూడు నెలల నుంచి అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న మండల వాసులు బుధవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో సేదతీరారు. ఉదయం ఎండలు అధికంగా ఉన్నా.. మధ్యాహ్నం మేఘాలు ఆవరించాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు హమ్మయ్య అని అనుకున్నారు. రైతన్నలు తొలకరి జల్లులతో పులకించిపోయారు.



చీరాల: గోపాలకృష్ణయ్య పార్కు వద్ద నిలిచిన వర్షం నీరు

జరుబులవారిపాలెంలో నేత్ర దానం



వెంకటేశ్వర్లు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని జరుబులు వారిపాలెంలో బుధవారం మృతి చెందిన నల్లూరు వెంకటేశ్వర్లు (85) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో కార్నియాలు సేకరించారు.

సీజనల్ వ్యాధులతో జీవాలు జాగ్రత్త

మార్టూరు: గొర్రెలు, మేకలు, పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని బాపట్ల జిల్లా పశువైద్యాధికారి ఎం. హనుమంతరావు అన్నారు. బుధవారం నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. పశు వైద్యసహాయ సంచాలకులు వై. పద్మావతి, మార్టూరు, యద్దనపూడి మండలాల పశువైద్యులు, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ తహసీల్దార్‌గా రవిబాబు



బాధ్యతలు తీసుకుంటున్న తహసీల్దార్

బల్లికురవ: తహసీల్దార్ కె. రవిబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా అర్ధవీడు తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డీటీ రవికుమార్, కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

నేడు నర్సరీ యాజమాన్యాలతో సమావేశం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం బాపట్ల జిల్లా షేడ్‌నెట్ నర్సరీ యజమానులకు అవగాహన శిబిరం నిర్వహించనున్నట్లు మార్టూరు ఉద్యాన వన శాఖాధికారి బి. హనుమంతనాయక్ తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్, ఉద్యాన వన శాఖాధికారి పి. జెన్నమ్మ షేడ్ నెట్ వ్యవసాయ నిర్వహణలో లైసెన్స్‌లు పొందే విధానం, రిజిస్టర్‌లు, బిల్లు పుస్తకాలు నిర్వాహణపై అవగాహన కలిస్తారని తెలిపారు.

శ్రీనివాసగౌడ్‌కు కొత్తపల్లి సాహితీ పురస్కారం

అనంతపురం కల్చరల్: కొత్తపల్లి సురేంద్రబాబు సాహితీ పురస్కారానికి ఈ ఏడాది ప్రముఖ కవి శ్రీనివాస గౌడ్‌ను ఎంపిక చేసినట్టు అవార్డు నిర్వాహకులు కొత్తపల్లి సురేష్ తెలిపారు. చీరాలకు చెందిన శ్రీనివాస గౌడ్ కవిత్వం, కథ, విమర్శ, అనువాదాల్లో తనదైన ప్రత్యేక శైలిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. 50 పుస్తకాలు పోటీకి వస్తే అందులో శ్రీనివాస గౌడ్ రచించిన 'చిన్ని చిన్ని సంగతులు' కవితా సంపుటిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో అనంతపురంలో జరిగే కార్యక్రమంలో శ్రీనివాస గౌడ్‌కు పురస్కారాన్ని ప్రదానం చేస్తామని తెలిపారు.

పోటీతత్వం అలవర్చుకోండి



బల్లికురవలో బహుమతులు అందిస్తున్న అంబడిపూడి బ్యాంకు మేనేజర్



గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

బల్లికురవ: విద్యార్థులు చదువుతోపాటు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని పెదఅంబడిపూడి యూనియన్ బ్యాంకు మేనేజర్ అజిత్ కుమార్ కోరారు. బుధవారం మండల స్థాయిలో స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఐ అఖిల భారత క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 9 టీంలు, 18 మంది పాల్గొన్నారు. వీరిలో కొప్పరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన కె. నాగసాయి చరణ్‌తేజ బత్తుల అభిరామ్ ప్రథమ స్థానాన్ని, బల్లికురవ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ జతిన్, ఎన్. శాయి ద్వితీయ స్థానాన్ని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలకు చెందిన కె. భాస్కరరావు, పి. శాయితేజ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బ్యాంకు తరపున వరసగా రూ. 5 వేలు, రూ.4 వేలు రూ.3 వేల నగదు, ప్రశంస పత్రాలు అందజేశారు.

యద్దనపూడి: విద్యార్థుల్లో ఆర్థిక అవగాహనను కల్పించేందుకు రిజర్వ్ బ్యాంక్ క్విజ్ పోటీలను నిర్వహిస్తుందని ఎంఈఓ పి. సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం నిర్వహించారు.

పోటీ పరీక్షలతో విద్యా ప్రమాణాలు మెరుగు

జె.పంగులూరు: పోటీల పరీక్షలతో విద్యా ప్రమాణాలు మెరుగు పడతాయని చందలూరు కెనరా బ్యాంక్ మేనేజర్ దాసరి అనిల్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో హైస్కూల్ విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్విజ్ ఫర్ చిల్డ్రన్ పోటీలు జరిగాయి. పంగులూరు విద్యార్థులు ఉన్నం అఖిల్ బాబు, రాయిణి సాంబశివ ప్రథమ స్థానం, బూదవాడ విద్యార్థులు భవనం శివాని, దివ్య ద్వితీయ స్థానం సాధించగా, కొండమంజులూరు విద్యార్థులు ఫణిదపు యశ్వంత్, యశస్విని తృతీయ స్థానం సాధించారు. పంగులూరు జహెచ్‌ఎం కొప్పోలు రమాదేవి, ఉపాధ్యాయులు రామకోటిరెడ్డి, బ్యాంక్ అధికారి అనిల్ బహుమతులు పంపిణీ చేశారు.

చీరాల అర్బన్: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలని చీరాల యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎ.వెంకట రవీంద్ర అన్నారు. బుధవారం మండల స్థాయి క్విజ్ పోటీలను పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఈపూరుపాలెం, కేజీఎం స్కూల్, ఏఆర్‌ఎం హైస్కూల్‌లు వరుసగా మొదటి మూడు బహుమతులను గెలుచుకున్నాయి. హెచ్‌ఎం బి.సాల్మన్ రాజు, అసిస్టెంట్ మేనేజర్ బీవీ రమణమూర్తి, మండల కోఆర్డినేటర్ పి.భానుచంద్రమూర్తి, కె.సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం

వేటపాలెం: విద్యార్థి దశ నుంచి బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్. శ్రీనివాసరావు సూచించారు. స్థానిక బీబీహెచ్ కళాశాలలో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఐదు ప్రభుత్వ హైస్కూల్ కి చెందిన విద్యార్థులకు ఆర్‌బీఐ పై క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన జి. లక్ష్మీదుర్గ రూ.5 వేలు, కొత్తపేట జెడ్పీ స్కూల్ విద్యార్థి రూ.4, పందిళ్లపల్లి జెడ్పీ స్కూల్ విద్యార్థి రూ.3 వేలు గెలుపొందారు.

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ వలేరు రవిబాబు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓ సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల వద్దకే రోటరీ క్లబ్



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బుర్లవారిపాలెంలో రైతుల వద్దకే రోటరీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వేటపాలెం మండల వ్యవసాయాధికారి కాశీ విశ్వనాథ్.. తొలకరి వ్యవసాయ పనులు ఎలా మొదలు పెట్టాలి, ఎరువులు ఏమి వాడాలి, పంటలను ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఐ.బాబూరావు, పోలుదాసు రామకృష్ణ, సుభాషిణి, దేగల తిరుపతిరావు, గొడవర్తి సుధాకరరావు పాల్గొన్నారు.

లారీని ఢీ కొన్న టెంపో.. ఐదుగురికి గాయాలు



కొరిశపాడు సమీపంలో జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న టెంపో ముందు భాగం



మార్టూరు: ప్రమాదంలో గాయపడిన ప్రవీణ్



రోడ్డు ప్రమాదంలో గాయపడిన చక్రవర్తి

మేదరమెట్ల: టెంపో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన టెంపో ముందు వెళుతున్న లారీని ఢీ కొన్న సంఘటన బుధవారం తెల్లవారిజామున కొరిశపాడు జాతీయరహదారిపై చోటు చేసు కుంది. వైజాగ్ సమీపంలోని కంచర్లపాలెం నుంచి తిరుపతి వెళ్లేందుకు మంగళవారం రాత్రి టెంపోలో 15 మంది బయలు దేరారు. వాహనం కొరిశపాడు జాతీయరహదారి సమీపానికి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన టెంపో ముందు ఉన్న లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఐదుగురికి రక్త గాయాలు కాగా వీరిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మేదరమెట్ల ఎస్సై నాగశివారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్, బైకు ఢీ యువకునికి గాయాలు

మార్టూరు: ఎదురెదురుగా వస్తున్న బైకు, ట్రాక్టర్ ఢీ కొన్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన స్థానిక జాతీయ రహదారిపై రాజుపాలెం సమీపంలో బుధవారం జరిగింది. కనిగిరి చెందిన వి. ప్రవీణ్ ద్విచక్రవాహనంపై గుంటూరు వెళుతున్నాడు. రాజుపాలెం రెస్ట్ ఏరియా సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ప్రవీణ్ బైకును బలంగా ఢీ కొట్టాడు. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుంటూరుకు చెందిన వ్యక్తి..

జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరుకు చెందిన చక్రవర్తి ద్విచక్రవాహనంపై ఒంగోలు వెళుతున్నాడు. కోలలపూడి సమీపంలో చక్రవర్తి వాహనాన్ని అదే మార్గంలో ఒంగోలు వైపు వెళుతున్న ఇన్నోవా కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. తలకు తీవ్ర గాయం కావడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సబ్సిడీ లోన్లకు విశేష స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో సబ్సిడీలోను క్యాంప్ జరిగింది. ఎంపీడీఓ రమాంజనేయులు మాట్లాడుతూ అర్హులైన వారికి రుణాలు అందించాలి కోరారు. మల్లవరం బ్యాంక్ ఆఫ్ బరోడా, పంగులూరు ఆంధ్ర ప్రగతి బ్యాంక్, చిన్నమల్లవరం సిండికేట్ బ్యాంక్ మేనేజర్లు పాల్గొని అప్లికేషన్లు పరిశీలించారు.

కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు



ఉప్పుమాగులూరులో మాట్లాడుతున్న కుమారి

బల్లికురవ: కౌలు రైతులంతా పంట సాగుహక్కు పత్రాలతో ఈ పంట నమోదు చేసుకుంటే రాయితీలు, ప్రభుత్వ పథకాలు పొందవచ్చని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి అన్నారు. బుధవారం ఉప్పుమాగులూరు 1, ఉప్పుమాగులూరు 2 సచివాలయాల్లో కౌలు రైతులతో సదస్సులు నిర్వహించారు. వీఆర్వోలు అశోక్ చక్రవర్తి, వీరయ్య, వీపీఏలు పాల్గొన్నారు.